వైద్యుల కొరత.. రోగుల వ్యథ!

- నలుగురితో నెట్టుకొస్తున్న వైనం
- రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో రోగులు అవస్థలు
- మెడికల్ లీవ్‌లో ఏడుగురు వైద్యులు
- వైద్యసేవలపై రోగులు, బంధువుల ఫిర్యాదు


వైద్యం కోసం ఓపీలో క్యూకట్టిన రోగులు

రాయదుర్గంటౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పల్లె, పట్టణం తేడా లేకుండా వైద్యసేవలు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందాయి. సమస్యలున్నాయని రోగులు ఫిర్యాదులు చేసిన దాఖలాలు మచ్చుకైనా కనిపించవు.. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత వైద్య రంగం నిర్వీర్యమైంది. సిబ్బంది కొరత, రోగుల వ్యథ అన్నట్లుంది పరిస్థితి. రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో గత మూడు నెలలుగా వైద్యుల కొరతతో సేవలు అందక రోగులు అవస్థలు పడుతున్నారు. ఉన్న సిబ్బందికి పనిభారం పడుతోంది.

రాయదుర్గంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు సక్రమంగా అందక రోగులు అవస్థలు పడుతున్నారు. గత నాలుగు నెలల క్రితం దాదాపు 12 మంది వైద్యులు సేవలు అందిస్తుండేవారు. ప్రస్తుతం కేవలం నలుగురు వైద్యులు మాత్రమే అందుబాటులో ఉన్నారు. దాదాపు ఏడుగురు వైద్యులు మెడికల్ లీవ్ పెట్టడంతో పూర్తి స్థాయి వైద్య సేవలు అందడం లేదు. ఏరియా ఆస్పత్రిలో సివిల్ సర్జన్‌లు, డిప్యూటీ సివిల్ సర్జన్‌లు, జనరల్ మెడిషన్ విభాగంలో మొత్తం 22 పోస్టులు మంజూరయ్యాయి. ప్రస్తుతం వీటిలో ఒక గైనకాలజిస్ట్, సర్జన్, చిన్న పిల్లల వైద్య నిపుణుడితో వైద్య సేవలు అందిస్తున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవి ప్రతిపాదనల మేరకు ఉన్నతాధికారులు కణేకల్లు, కళ్యాణదుర్గం ఆస్పత్రుల నుంచి ఇద్దరు వైద్యులను వారానికి మూడు రోజుల చొప్పున నైట్ డ్యూటీలకు కేటాయించారు. స్పెషలిస్ట్ డాక్టర్లు మెడికల్ లీవ్‌పై వెళ్లడంతో వైద్య సేవలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఒక సర్జన్, గైనకాలజిస్ట్, జనరల్ మెడిషన్, డెర్మటాలజిస్ట్, పైథాలజిస్ట్ వైద్యులు మెడికల్ లీవ్‌లో వెళ్లారు. వారు మళ్లీ ఎప్పుడు విధుల్లోకి వస్తారో తెలియని పరిస్థితి.

రోజూ 400 మందికి ఓపీ సేవలు..

ఏరియా ఆస్పత్రికి పట్టణంతోపాటు పరిసర గ్రామాల నుంచి రోజుకు దాదాపు 400 మందికిపైగా ఓపీలో వైద్యసేవలు పొందుతున్నారు. 50 మందికిపైగా అడ్మిషన్‌లో ఉంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వైద్యుల కొరత కారణంగా ఆస్పత్రికి వచ్చే రోగులకు సరైన వైద్య సేవలు అందక అవస్థలు పడుతున్నారు. ఇక అత్యవసర కేసుల్లో వైద్యుల ఇబ్బందులు మరింత అధికంగా ఉంటున్నాయి. విధుల్లో ఉన్న డాక్టర్లపై పని ఒత్తిడి కూడా అధికమైంది. కొన్ని రోజులుగా ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలపై ఫిర్యాదులు, పనిభారం భరించలేక వైద్యులు మెడికల్ లీవ్‌పై వెళ్లినట్లు సమాచారం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులతో ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సేవలు మృగ్యమయ్యాయి.



దంత విభాగంలోనూ అందని సేవలు..



మరోవైపు ఏరియా ఆస్పత్రిలోని దంత వైద్య విభాగంలో సేవలు సక్రమంగా అందక పంటి నొప్పితో వచ్చే రోగులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యమైన సిమెంట్ ఫిల్లింగ్ చికిత్స, పళ్ల కట్టే సౌకర్యం లేదు. దంత చికిత్సల కోసం రోజుకు 20 నుంచి 30 దాకా రోజూ ఆస్పత్రికి వస్తుంటారు. ఆస్పత్రికి వచ్చే రోగులను పరీక్షించడం పళ్లు పుచ్చువుంటే తొలగించడం. అవసరమైన రోగులకు పళ్ల క్లీనింగ్(వాష్) చేయడం, మందులు రాసి ఇవ్వడం. ప్రస్తుతం ఇది దంత వైద్య విభాగంలో జరుగుతున్న తీరు. అంతేకాక వారంలో మూడు రోజుల పాటు మాత్రమే దంత వైద్య సేవలు అందుతున్నాయి. మరో మూడు రోజులు ఎన్‌టిహెచ్‌పీ కార్యక్రమంలో భాగంగా దంతవైద్యురాలు గుమ్మఘట్ట, డి.హీరేహాళ్, నాగలాపురం పీహెచ్‌సీలకు వెళ్లి చికిత్సలు అందజేయాల్సి ఉంటుంది. ఈ కారణంగా ఏరియా ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో రోగులకు దంత సేవలు అందడం లేదు. దంత వైద్యం సక్రమంగా అందక ప్రైవేట్ క్లినిక్‌లు లేదా బళ్లారి, అనంతపురానికి వెళ్లాల్సి వస్తోందని ప్రజలు అంటున్నారు. పేద, సామాన్య ప్రజలు ఖర్చుతో కూడుకున్న వైద్యం చేయించుకోలేక, స్థానికంగా దంత వైద్యసేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



వివిధ కారణాలతో వైద్యులు మెడికల్ లీవ్ తీసుకున్నారు. దీంతో ఆస్పత్రిలో వైద్య సేవలపై తీవ్ర చూపుతోంది. ఉన్న వైద్యులతోనే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. నైట్ డ్యూటీలకు ఇబ్బంది రాకూడదనే ఉద్దేశంతో ఉన్నతాధికారుల చొరవతో కణేకల్లు, కళ్యాణదుర్గం నుంచి ఇద్దరు వైద్యులు రోజు విడిచి రోజు వస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా వైద్యులను నియమించాలని ఉన్నతాధికారులకు నివేదించాం.

– పి.మాధవి, సూపరింటెండెంట్, రాయదుర్గం ఏరియా ఆస్పత్రి

క్లుప్తంగా

ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించండి

కూడేరు: ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ప్రజలు, రైతులను కార్యాలయాలు చుట్టూ తిప్పుకోవద్దని ఆర్డీఓ వసంత బాబు మండల సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని గొటుకూరు, బ్రాహ్మణపల్లిలో భూసమస్యలపై ఫిర్యాదులు రావడంతో ఆర్డీఓ వసంతబాబు, తహసీల్దార్ మహబూబ్ బాషా పరిశీలించారు. అనంతరం ఆయన కూడేరు తహసీల్దార్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడారు. సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. నిబంధనల మేరకు భూసమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్ , వీఆర్వోలు పాల్గొన్నారు.

రాయదుర్గం-బళ్లారి సర్వీసులు ప్రారంభం


ఆర్టీసీ నూతన బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం నుంచి బళ్లారికి రెండు నూతన ఆర్టీసీ పల్లెవెలుగు బస్సులను ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు గురువారం ప్రారంభించారు. స్థానిక ఏపీఎస్‌ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన సర్వీసులను ఆర్టీసీ డీఎం సురేష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటి దాకా డిపో నుంచి వివిధ ప్రాంతాలకు 5 నూతన సర్వీసులను అందుబాటులోకి తెచ్చామని, మరిన్ని నూతన సర్వీసులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

డిపో సమస్యలు పరిష్కరించండి

రాయదుర్గం డిపోలో పలు సర్వీసులు రద్దు చేయడంతో ప్రజలకు అసౌకర్యంతోపాటు డిపో ఆదాయం తగ్గిపోయే అవకాశం ఉందని, తక్షణం సమస్యలు పరిష్కరించాలని ఏపీపీటీడీ ఉద్యోగ సంఘం నాయకులు కోరారు. ఈమేరకు గురువారం యూనియన్ నాయకులు నాగరాజు, తిప్పేస్వామి, జిలాన్ తదితరులు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు.

మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసుకోండి


మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

కళ్యాణదుర్గం రూరల్: మద్యం షాపులు నిర్వహించేందుకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య గురువారం తెలిపారు. పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. నాగమద్దయ్య మాట్లాడుతూ, మద్యం దుకాణాలను నిర్వహించేందుకు దరఖాస్తులు శుక్రవారం చివరితేదీ అని అన్నారు. 14న అనంతపురంలోని రెవెన్యూ భవన్‌లో మద్యం షాపులకు దరఖాస్తు చేసుకున్న వారికి లాటరీ పద్ధతిలో మద్యం షాపలను ఎంపిక చేస్తారన్నారు. 16 నుంచి నూతన మద్యం షాప్‌లు అందుబాటులోకొస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి ఎక్సైజ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం షాపులకు 27 దరఖాస్తులు

కంబదూరు: మండల పరిధిలో ఏర్పాటు కానున్న నాలుగు మద్యం షాపులకు గురువారం నాటికి మొత్తం 27 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ మహమ్మద్ రఫీ, ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో వారు వివరాలు తెలియజేశారు. ఆసక్తి ఉన్న వారు శుక్రవారం రాత్రి ఏడు గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తమపై ఎలాంటి ఒత్తిళ్లు లేవన్నారు. మ్యాన్యువల్, ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

కూలీలందరికీ ఉపాధి కల్పిస్తాం


మాట్లాడుతున్న ఎంపీడీఓ కుళ్లాయిస్వామి

కూడేరు: జాబ్ కార్డు కలిగిన కూలీలందరికీ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తామని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి తెలిపారు. గురువారం మండల పరిధిలోని చోళసముద్రం గ్రామంలో ఉపాధి పనుల కల్పనపై గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీఓ కుళ్లాయిస్వామి గుర్తించిన పనుల వివరాలను వెల్లడించారు. ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించేదుకు సిద్ధంగా ఉన్నారు. ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కూలీలకు ఆయన వివరించారు. నిబంధనల మేరకు పనులను చేస్తే వచ్చే కూలి వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీఓ తులసీ ప్రసాద్, టెక్నికల్ , ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటా


బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య


యర్రబోరేపల్లిలో మహేష్ కుటుంబానికి చెక్కులను అందిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

- మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త రంగయ్య

శెట్టూరు: ప్రతి కార్యకర్తకూ పార్టీతోపాటు తాను అండగా ఉంటానని మాజీ ఎంపీ తలారి రంగయ్య అన్నారు. గురువారం మండలంలోని యర్రబోరేపల్లి గ్రామంలో ఇటీవల టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త హరిజన మహేష్ కుటుంబాన్ని మాజీ ఎంపీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, జెడ్పీటీసీ మంజునాథ, మాజీ మండల కన్వీనర్ సోమనాథ రెడ్డి పరామర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంపిన రూ. 50 వేల చెక్కును బాధిత కుటుంబానికి అందించారు. మహేష్ ఆరోగ్య పరిస్థితిపై ఆయన ఆరా తీశారు. మహేష్ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. లోకేష్, చంద్రబాబు రెడ్ బుక్ రాజ్యాంగంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రాష్ట్రంలో దాడులకు పాల్పడుతూ మతాలు, కులాల మధ్య చిచ్చు పెడుతున్నారన్నారు. గ్రామాల్లో అందరూ కలిసి ప్రశాంతంగా జీవించే సంస్కృతిని కూటమి అధికారంలోకొచ్చిన వెంటనే పాడు చేశారన్నారు. రెడ్ బుక్ కాదు.. గుడ్‌బుక్‌ను ప్రజలు కోరుకోవాలని అన్నారు.కార్యక్రమంలో నాయకులు శెట్టూరు తిప్పేస్వామి, ఎమ్మెస్ హనుమంతరాయుడు, మల్లేష్, వెంకటరమణ, విజయ కుమార్, కేశవరెడ్డి, రాజ్‌కుఆమర్, వినోద్, శివశంకర్, వన్నూరుస్వామి, నరసింహులు, కేశవ, అనిల్, కంబాలపల్లి, రామచంద్ర, బాగూరప్ప, కేంచప్ప, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కంబదూరు: గత సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమిని జీర్ణించుకోలేక మనోవేదనతో మృతిచెందిన చెర్లోపల్లికి చెందిన వైఎస్సార్ నాయకుడు నెట్టికల్లప్ప కుటుంబాన్ని మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య వైఎస్సార్ సీపీ నాయకులతో గురువారం పరామర్శించారు. పార్టీ తరఫున మంజూరైన రూ.50వేల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. మాజీ ఎంపీ రంగయ్య మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, బీసీ, రైతు విభాగాల జిల్లా ప్రధాన కార్యదర్శులు గోవిందు, హనుమంత రాయుడు, వైస్ ఎంపీపీ భీమేష్, సీనియర్ నాయకులు తిమ్మ రాయుడు, డాక్టర్ బొమ్మయ్య, వెంకటేష్, అమర్, ఎంపీటీసీ భాస్కర్, బయ్యన్న, హనుమంతరెడ్డి, పరందామ రెడ్డి పాల్గొన్నారు.

చెక్‌డ్యాంలో పడి విద్యార్థి మృతి


చెక్‌డ్యాంలో పడి మృతిచెందిన అఫ్జల్

వజ్రకరూరు: మండలంలోని జరుట్ల రాంపురంలో ప్రమాదవశాత్తూ చెక్‌డ్యాంలో పడి అఫ్జల్ (9) మృతి చెందాడు. గ్రామానికి చెందిన దస్తగిరి, వజీదా దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె సంతానం. కుమారుడు అఫ్జల్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం అఫ్జల్‌తోపాటు మరో ఇద్దరు పిల్లలు గ్రామ సమీపంలోని చెక్‌డ్యాం వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తూ అఫ్జల్ చెక్‌డ్యాంలో పడ్డాడు. స్థానికులు చెక్‌డ్యాంలో వెతికారు. అప్పటికే మృతి చెందాడు. బాలుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయాలు అలుముకున్నాయి.

ప్రధాన రహదారిపై గుంతలకు మరమ్మతులు


రహదారిపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కూడేరు: కూడేరులో స్టేట్ బ్యాంక్ దగ్గర అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై రెండు అడుగుల లోతు ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేశారు. 'సాక్షి'లో 'ప్రమాదకరంగా గుంతలు' శీర్షికన ఇటీవల వార్త ప్రచురితమైంది. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు గురువారం స్పందించారు.ఈ రహదారి పై వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. ఈ గుంతలతో తరుచూ రోడ్డు ప్రమాదాలు చేసుకునేవి. గుంతలకు మరమ్మతులు చేపట్టడంతో వాహనదారులకు ఇబ్బందులు తొలిగాయి.

శ్రీరామరెడ్డి నీటి సరఫరా కార్మికుల సమ్మె విరమణ

కూడేరు: మండల పరిధిలోని పీఏబీఆర్ డ్యాం వద్ద ఏర్పాటైన శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా ప్రాజెక్ట్‌లో పని చేస్తున్న కార్మికులు గురువారం సమ్మె విరమించారు. గత నెల 30 నుంచి కార్మికులు సమ్మె చేశారు. తాగునీటి కార్మికులు , సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులుతో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మురళి, డీఈ శ్రీనివాసులు, జేఈ చౌదరి, కాంట్రాక్టర్లు శివశంకర్ రెడ్డి, శివారెడ్డి చర్చలు జరిపారు. తొలగించిన 21 మందిని విధుల్లోకి తీసుకుంటామని, ఈ నెలాఖరుకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు, పీఎఫ్ చెల్లిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా ప్రాజెక్ట్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్రిస్వామి , మాజీ అధ్యక్షుడు నాగరాజు, సీఐటీయూ నగర కార్యదర్శి వెంకటనారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యం బాగుండాలి


ఉద్దేహాళ్‌లో మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

బొమ్మనహాళ్: ప్రతి వ్యక్తీ మానసిక ఆరోగ్యం బాగుంటేనే జీవితం సంతోషంగా ఉంటుందని వైద్యాధికారులు శ్రీలక్ష్మి, గీతాభార్గవి అన్నారు. గురువారం మండలంలోని ఉద్దేహాళ్, గోనేహాళ్ గ్రామాల్లో మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, శివప్రసాద్, ఏఎన్‌ఎంలు గోవర్ధన, వెంకటరమణ, గౌతమి, నాగమణి పాల్గొన్నారు.

సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో ఫాతేహాలు



బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో భక్తులు దర్గాలో గురువారం ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. గురువారం స్వామివారం కావడంతో భక్తులు స్వామి దర్శనార్థం ఆంధ్రా,కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామి దర్శనానికి బారులుతీరారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి, ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం భక్తులు కందూరీలు చేశారు.

జగజ్జననీ పాహిమాం..


కణేకల్లులో రాజరాజేశ్వరీదేవి అవతారంలో అమ్మవారు

రాయదుర్గంటౌన్:నియోజకవర్గంలోని అమ్మవారి ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. 8వ రోజు గురువారం పట్టణంలోని నగరేశ్వర కన్యకాపరమేశ్వరి ఆలయంలో లక్ష్మీదేవి అలంకరణలో వాసవీమాత భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శాంతినగర్‌లోని పెద్ద బన్నీ మహంకాళిమాతకు విశేష అలంకరణతో ప్రత్యేక పూజలు, నానా విధ ద్రవ్యాభిషేకం, కుంకుమార్చన, అభిషేకాలు చేశారు. ఓబుళాచారి రోడ్డులోని వెలసిన బన్నీ మహంకాళిదేవి, నేసేపేటలోని చౌడేశ్వరీదేవి, కోటలోని కాళికాంబదేవి ఆలయం, హటకేశ్వర స్వామి ఆలయం, వరలక్ష్మీవీధిలో వెలసిన దుర్గాదేవి, మల్లాపురం లేఅవుట్‌లో వెలసిన గజలక్ష్మీదేవి, బొమ్మక్కపల్లిలోని రాజరాజేశ్వరిదేవి ఆలయం, గద్వాల్ యల్లమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెరలో వీరభద్ర స్వామి ఆలయంలో భద్రకాళి అమ్మవారు అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

దుర్గాదేవి నమోస్తుతే..

ఉరవకొండ: పట్టణంలోని ప్రసిద్ధిగాంచిన జగదీశ్వరీ, సిండికేట్ బ్యాంకు సమీపంలో ఉన్న శ్రీ ఉరగాద్రి చౌడేశ్వరి అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జగదీశ్వరీ ఆలయ ధర్మకర్త గాజుల శ్యామలమ్మ ఆధ్వర్యంలో దుర్గాదేవి హోమం ఏర్పాటు చేశారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

కణేకల్లు: కణేకల్లులోని దుర్గాదేవి ఆలయంలో గురువారం అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కనకదుర్గ ఆలయంలో బాలత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు జరిపించారు.


అన్నపూర్ణాదేవి అలంకరణలో భద్రకాళి అమ్మవారు


రాయదుర్గంలో లక్ష్మీదేవి అలంకరణలో కోటలోని వాసవీమాత


విశేష అలంకరణలో పూజలందుకున్న కాళికాంబదేవి


ఉరవకొండలో ఉరగాద్రి చౌడేశ్వరి అమ్మవారు

అలంకారప్రాయంగా ఈ-ఆటోలు


మున్సిపల్ కార్యాలయం వద్ద నిలిపి ఉన్న ఈ - ఆటోలు

రాయదుర్గంటౌన్: పట్టణంలో మున్సిపాలిటీలకు మంజూరు చేసిన ఈ- ఆటోలు అలంకారప్రాయంగా ఉన్నాయి. పట్టణంలో ఇళ్ల నుంచి తడి, పొడి చెత్త సేకరణకు గతేడాది ఆగస్టులో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ-ఆటోలను మున్సిపాలిటీలకు కేటాయించారు. రాయదుర్గం మున్సిపాల్టీకి 9 ఈ-ఆటోలను సరఫరా చేసి, చెత్త సేకరణ చేపట్టారు. వీటిలో ఏడు ఆటోలను చిన్నపాటి మరమ్మతులున్నాయని మున్సిపల్ కార్యాలయంలోనే ఓ మూలన నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వాటిని వినియోగంలోకి తీసుకురాలేదని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి.

కూడేరు-2 వీఆర్‌ఓగా ఎర్రెమ్మ

కూడేరు: కూడేరు-2 రెవెన్యూ వీఆర్‌ఓగా ఎర్రెమ్మను ఉన్నతాధికారులు నియమించారు. దీంతో గురువారం వీఆర్‌ఓగా బాధ్యతలు తీసుకున్నారు. ఈమె కళ్యాణదుర్గం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఓబులేసు కళ్యాణదుర్గానికి బదిలీపై వెళ్లారు.

మానవతకు నిదర్శనం రతన్‌టాటా

- ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



ఉరవకొండ: భారత దేశం రత్నాన్ని కోల్పోయిందని, మానవతకు నిలువెత్తు నిదర్శనం పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటా అని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో అన్నారు. రతన్‌టాటా మృతి పట్ల సంతాపం తెలియజేశారు. రతన్‌టాటా అంటే భారతదేశపు ఉనికి అని చెప్పేలా ఆయన సామ్రాజ్యాన్ని అంతర్జాతీయ స్థాయికి విస్తరింపజేశారన్నారు. రతన్‌టాటా దేశానికి తీరని లోటు అన్నారు. ప్రపంచ పారిశ్రామిక రంగానికి రతన్‌టాటా ఆదర్శంగా నిలిచారన్నారు. ఉప్పు నుంచి మొదలుకొని విమానయాన రంగం వరకు భారతదేశపు అణుఅణువునా టాటా అనే పేరు ధ్వనించేలా వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారన్నారు. పారిశ్రామిక వేత్తగానే కాకుండా గొప్ప మానవతావాదిగా ఆయన దేశానికి చేసిన సేవలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. కరోనా సమయంలో రూ. 1,500 కోట్లు, భారతదేశానికి యుద్ధవిమానాల కోసం రూ.2 వేల కోట్లు అందించిన మహోన్నత వ్యక్తి అన్నారు.

పామాయిల్ పంట పరిశీలన


పామాయిల్ మొక్కను పరిశీలిస్తున్న హార్టికల్చర్ ఆఫీసర్ నెట్టికంటయ్య

కూడేరు: మండలంలోని ఇప్పేరు, కలగళ్ల, మరుట్లలో రైతులు సాగు చేసిన పామాయిల్ పంటను నియోజకవర్గ ఉద్యానవన శాఖ అధికారి (హెచ్‌ఓ) నెట్టికంటయ్య, ఎంకే ఆగ్రోటెక్ కంపెనీ ప్రతినిధి మురళీ గురువారం పరిశీలించారు. పామాయిల్ పంటల సాగు లాభదాయకంగా ఉంటుందని వారు రైతులకు తెలిపారు. మంచి దిగుబడులు సాధించడానికి తీసుకోవాల్సిన జాగ్రతలపై వివరించారు. ఆంధ్రప్రదేశ్ ఉద్యానవన శాఖ సహకారంతో ఎంకే ఆగ్రోటెక్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా ఈ పామాయిల్ మొక్కలను ఇవ్వనున్నట్లు తెలిపా రు. రైతులు పామాయిల్ పంట సాగు చేసేందు కు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంకే ఆగ్రోటెక్ సిబ్బంది సుమంత్ పాల్గొన్నారు.

వీఆర్వోలకు సన్మానం


వీఆర్వోలకు సన్మానం చేస్తున్న తహసీల్దార్ మునివేలు

బొమ్మనహాళ్: బదిలీపై వెళ్తున్న వీఆర్వోలకు తహసీల్దార్ మునివేలు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న వీఆర్వోలు హరిప్రసాద్, తిమ్మప్ప, వన్నూరప్పకు తహసీల్దార్ మునివేలు, రెవెన్యూ సిబ్బంది పూలమాల శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డీటీ శ్యామ్, వీఆర్వోలు సుజాత, నరసింహమూర్తి, శృతి, యుగంధర్, రామన్న పాల్గొన్నారు.

ఎంపీడీఓగా నందకిశోర్



బ్రహ్మసముద్రం : ఎంపీడీఓగా ఎం. నందకిశోర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీ ఓ దాసానాయక్ ఇటీవలే డీ హీరేహాళ్‌కు బదిలీ అ య్యా రు. ఏఓగా పని చేస్తున్న నందకిశోర్‌ను ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా నియమించినట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

'మోసపోయాం ఆదుకోండి సార్'

కళ్యాణదుర్గం రూరల్: ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి మోసం చేశారు..ఆదుకోండి సార్ అని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును నిరుద్యోగులు కలిసి విన్నవించారు.గురువారం పట్టణానికి చెందిన యువకులు, నిరుద్యోగులు, పట్టణంలోని టీడీపీ ప్రజావేదిక వద్ద ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును కలిసి విన్నవించారు. మదనపల్లికి చెందిన మమత, శ్రీకాకుళానికి చెందిన అనిత, విజయవాడకు చెందిన అవినాష్, ఈశ్వర్‌రెడ్డి మోడల్ స్కూల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఒక్కొక్కరి నుంచి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలు వసూలు చేశారన్నారు.

రేపు దసరా సంబరాలు

అనంతపురం రూరల్: దసరా పండగను పురస్కరించుకుని ఈనెల 12న శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏఓ కృష్ణప్రసాద్ గురువారం తెలిపారు. ఈనెల 12న లలిత నాట్య కళానికేతన్ నృత్య గురువు బాబు బాలాజీ, శిష్య బృందం ఆధ్వర్యంలో భరతనాట్యం, జానపద నృత్యాల ప్రదర్శన ఉంటుందన్నారు. 13న సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.